సాక్షి ఆదిలాబాద్

మంగళవారం ၊ 24 ၊ జనవరి ၊ 2023



తీరనున్న ప్రయాణ కష్టాలు..
కరంజి(టి) నుంచి గుబిడి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో గుబిడి గ్రామస్తుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. 9లో▸



బాసరకు 'వసంత' శోభ
వసంత పంచమి వేడుకలకు ప్రసిద్ధ క్షేత్రం బాసర ముస్తాబైంది. మంగళవారం నుంచి వేడుకలు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
32.1 /18.4

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు ఒకటి రెండు డిగ్రీలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండగా అనిపిస్తుంది. చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది.

న్యూస్‌రీల్

నేడు విద్యాసంస్థలకు సెలవు

కైలాస్‌నగర్: ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో జరుగుతున్న నాగోబా జాతరలో భాగంగా మంగళవారం నిర్వహించనున్న ప్రజాదర్బార్‌ను పురస్కరించుకుని ఈ నెల 24న ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు (పాఠశాలలు, కళాశాలలు) స్థానిక ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి బదులుగా ఫిబ్రవరి 11న విద్యాసంస్థలను యథావిధిగా నిర్వహించాలని ఆమె సూచించారు.

'కంటి వెలుగు' పకడ్బందీగా నిర్వహించాలి



వివరాలు తెలుసుకుంటున్న శ్రీజ

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ట్రెయినీ కలెక్టర్ శ్రీజ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కంట్రోల్ రూమ్‌ను సోమవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట డీఎల్‌ఓ శ్రీకాంత్, ఎన్‌హెచ్‌ఎం డీపీఓ అనిల్ కుమార్, డీడీఎంలు రమణ, శివ, తదితరులు ఉన్నారు.


విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానం పెంపొందించాలి



మాట్లాడుతున్న విద్యాశాఖ ఏడీ నర్సింహులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానం మరింతగా పెంపొందించాలని విద్యాశాఖ ఏడీ నర్సింహులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో సైన్స్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. విద్యార్థులను సైన్స్ పట్ల ప్రోత్సహించి వారు భావితర శాస్త్రవేత్తలుగా ఎదిగేలా చూడాలన్నారు. ప్రయోగాల ద్వారా విద్యాబోధన చేస్తే పాఠ్యాంశాలు సులువుగా అర్థమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, బయోసైన్స్ ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాఘవేందర్, పొచ్చరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కృష్ణకుమార్, రవీందర్, రవీంద్ర, సూర్యకుమార్, గౌస్, ఆరె భాస్కర్, ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు పవన్, తదితరులు పాల్గొన్నారు.

'భావ ప్రకటన స్వేచ్ఛ హక్కును హరిస్తే ఊరుకోం'



మాట్లాడుతున్న దర్శనాల మల్లేశ్

ఎదులాపురం: భావ ప్రకటన స్వేచ్ఛ ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దాన్ని హరించే హక్కు ఎవరికీ లేదని భావ స్వేచ్ఛ ప్రకటన వేదిక ప్రతినిధి, సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. వేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి మతోన్మాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ హిందీ రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలో రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేలా కొందరు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉద్యమాలకు పురిటిగడ్డ తెలంగాణ అని, మతోన్మాద శక్తులు విచ్చలవిడిగా దాడులకు పాల్పడుతూ భావ స్వేచ్ఛ ప్రకటనను హరిస్తే ఊరుకోమన్నారు.

అసైన్డ్‌భూమిని ఆధీనంలోకి తీసుకున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని సర్వేనంబర్ 181/7లో 2.18 ఎకరాల విస్తీర్ణం గల వ్యవసాయ అసైన్డ్ భూమిని సోమవారం రెవెన్యూ అధికారులు ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఐ హన్మంత్‌రావ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసినందుకు పీఓటీ యాక్ట్ 1977 ప్రకారం ఆ భూమిని ఆధీనంలోకి తీసుకోవాలని తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు అమృత్, సర్వేయర్ రాథోడ్ శ్రీనివాస్, వీఆర్‌వో పొచ్చన్న, తదితరులు ఉన్నారు.

చూస్కో.. రాస్కో..!



పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

- డిగ్రీ పరీక్షల్లో ఆగని మాస్ కాపీయింగ్
- జిల్లాలో 200 మంది వరకు డిబార్
- సోమవారం ఉట్నూర్‌లో 33 మంది..
- ఇచ్చోడ, ఉట్నూర్‌లోనే అత్యధికం
- ప్రత్యేక స్క్వాడ్‌లు నియమించినా మారని తీరు

ఆదిలాబాద్‌టౌన్: డిగ్రీ పరీక్షల తీరు అభాసు పాలవుతోంది. ఎన్ని విమర్శలు వచ్చినా పరీక్షల తీరు మాత్రం మారడం లేదు. కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని పరీక్షల తీరును చూస్తే ఇతర జిల్లాల కంటే ఆదిలాబాద్‌లోనే చూచిరాతకు పాల్పడుతూ అత్యధికంగా విద్యార్థులు డిబార్ అయ్యారు. మాస్‌కాపీయింగ్‌ను నిరోధించేందుకు చర్యలు చేపట్టిన అధికారులపై దాడులకు దిగడం ఆ పరీక్షల తీరుకు అద్దం పడుతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం 250 వరకు డిబార్ కాగా, ఆదిలాబాద్ జిల్లాలోనే దాదాపు 200 మంది విద్యార్థుల వరకు డిబార్ అయ్యారని కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్ష విభాగం అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకంగా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినా కాపీయింగ్ మాత్రం ఆగడం లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఇచ్చోడ, ఉట్నూర్, ఆదిలాబాద్, లక్సెట్టిపేట, జన్నారం, మంచిర్యాలలో మాస్‌కాపీయింగ్ జోరుగా సాగుతోంది.

విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం..

జిల్లాలో దాదాపు 50 వరకు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. కొన్ని కళాశాలల్లో మాత్రమే రెగ్యులర్‌గా తరగతుల బోధన జరుగుతోంది. మిగితా కళాశాలలకు తరగతి గదులు లేకపోవడం, లెక్చరర్లు లేకపోవడంతో చదువులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. కళాశాలకు వచ్చిన విద్యార్థులు కాలక్షేపం చేసి ఇంటి బాట పడుతున్నారు. కష్టపడి చదివి పరీక్షలు రాయాల్సిన విద్యార్థులు ప్రైవేట్ యాజమాన్యాల మాటలు విని చీటింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. కళాశాలలో చేరకముందు తరగతులకు వచ్చినా.. రాకపోయినా పర్వా లేదని, తమ కళాశాలలో చేరితే పాస్ చేయిస్తామని ప్రలోభాలకు గురిచేయడంతో విద్యార్థులు ఇలా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులకు ఆశపడి కొంతమంది కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల భవిష్యత్‌తో ఆట లాడుకుంటున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉట్నూర్‌లో ఒకేరోజు 33 మంది డిబార్..

ఉట్నూర్‌లో సోమవారం జరిగిన డిగ్రీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న 33 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 14 మంది, పూలాజీబాబా డిగ్రీ కళాశాలలో 15 మంది, అజ్మీర రేఖశ్యామ్ డిగ్రీ కళాశాలలో నలుగురు విద్యార్థులు మాస్‌కాపీయింగ్ చేస్తూ పట్టుబడ్డారని కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు.

జిల్లాలోనే అత్యధికం..

కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలోని మిగితా జిల్లాల కంటే ఆదిలాబాద్ జిల్లాలోనే అత్యధికంగా విద్యార్థులు డిబార్ అవుతున్నారు. ఇచ్చోడలో ఈఏడాది ఎక్కువ మంది విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ డిబార్ అయ్యారు. గతంలో పలు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి కాపీయింగ్‌కు ప్రోత్సహించడంతో ఈ విషయం అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని కేయూ పరీక్షల విభాగం అధికారులు ఆదేశించారు. అయినప్పటికీ కాపీయింగ్‌ను నిరోధించలేపోతున్నారు. ఇచ్చోడలో విద్యార్థులను డిబార్ చేసిన అధికారుల కారును ధ్వంసం చేసిన ఘటన చోటు చేసుకుంది. ప్రతి కేంద్రానికి అబ్జర్వర్లను నియమించినా కాపీయింగ్ మాత్రం జరుగుతూనే ఉంది. ఉదయం పూట గదిలోకి వెళ్లేటప్పుడు ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా పరిశీలించినప్పటికీ లోన మాత్రం కాపీయింగ్ చేస్తున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేసినప్పుడు పదుల సంఖ్యలో డిబార్ అవ్వడం జరుగుతుంది. పరీక్ష 9 గంటలకు ప్రారంభమవుతుండగా ఆ తర్వాత ప్రశ్న పత్రం బయటకు వస్తుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిరాక్స్ సెంటర్లలో మినీ జిరాక్స్ చేయించి కేంద్రాలకు తీసుకొస్తున్నట్లు సమాచారం. కొంతమంది సిట్టింగ్ స్క్వాడ్‌లకు సంబంధిత కళాశాలల యాజమాన్యాలు కాసుల కక్కుర్తి చూపించి ఈ వ్యవహారాన్ని కానిచ్చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. కొన్ని ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో బోధన చేసే లెక్చరర్లు కాకుండా బయట వ్యక్తులకు ఇన్విజిలేషన్ విధులను అప్పజెప్తున్నారు.

బదిలీ, పదోన్నతులకు రంగం సిద్ధం

- నేడు ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన
- ఈ నెల 27 నుంచి మార్చి 4 వరకు ప్రక్రియ..?
- కసరత్తు చేస్తున్న విద్యాశాఖ



ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల కోసం రంగం సిద్ధమైంది. దీంతో కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పదోన్నతులు పొందే ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలన చేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో ప్రభుత్వ యాజమాన్య, లోకల్‌బాడీలలో స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్‌ఎం, ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందేవారి సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. కటాఫ్ ఇయర్‌కు సంబంధించి షెడ్యూల్ ప్రకటించారు. ముందస్తుగానే వారికి సమాచారం అందించారు. పదోన్నతుల సమయంలో ఇబ్బందులు కలగకుండా ఇప్పటికే విద్యాశాఖ ముందస్తుగా అందుకు అవసరమైన ప్రక్రియ చేపట్టింది. అధికారికంగా షెడ్యూల్ విడుదల కాకపోయినప్పటికీ అధికారులు కసరత్తు ప్రారంభించారు. కాగా షెడ్యూల్ మంగళ, బుధవారాల్లో అధికారికంగా విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారవర్గాలు చెబుతున్నాయి.

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

పదోన్నతులు పొందే ఉపాధ్యాయులకు సంబంధించి మంగళవారం డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్ కేటగిరీకి చెందిన జనరల్‌లో 1999 వరకు, ఎస్సీ కేటగిరికి సంబంధించి 1999 వరకు, ఎస్టీ కేటగిరికి సంబంధించి 2007 వరకు, వికలాంగులకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్ల సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు డీఈఓ ప్రణీత తెలిపారు. లోకల్‌బాడీకి సంబంధించి జనరల్ కేటగిరీకి చెందినవారు 2001 డీఎస్సీ వరకు, ఎస్సీ కేటగిరీకి చెందినవారు 2005, ఎస్టీ కేటగిరీకి చెందినవారు 2007, దివ్యాంగులందరి సర్టిఫికెట్లను పరిశీలించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

ఈ నెల 27 నుంచి ప్రక్రియ షురూ

ఈనెల 27 నుంచి బదిలీ, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం కానుంది. సోమవారం హైదరాబాద్‌లో పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌తో జిల్లా విద్యాశాఖాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బదిలీ, పదోన్నతులకు సంబంధించి వివరాలను సేకరించారు. ఆన్‌లైన్‌లోనే ప్రక్రియ చేపట్టనున్నట్లు విద్యాశాఖాధికారులు పేర్కొంటున్నారు. ఇందుకు సంబంధించి సిద్ధమైన షెడ్యూల్‌ను సోమవారం అధికారులకు అందజేశారు. విద్యాశాఖాధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 7న ఖాళీల జాబితా ప్రకటన, 28 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు, ఫిబ్రవరి 3 వరకు అభ్యంతరాల స్వీకరణ, ఫిబ్రవరి 14న ప్రధానోపాధ్యాయులకు బదిలీ పదోన్నతులు, ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతులు, ఫిబ్రవరి 22, 23 తేదీల్లో బదిలీలు, 25 నుంచి 27 వరకు ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు, మార్చి 4న ఎస్జీటీ ఉపాధ్యాయులకు బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. మార్చి 5 నుంచి 19 వరకు బదిలీ, పదోన్నతుల ప్రక్రియలో ఏదైనా పొరపాట్లు జరిగినట్లయితే నివేదించేందుకు ప్రభుత్వం గడువు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

పదోన్నతి ఖాళీలు ఇవే..

కేటగిరీ	ప్రభుత్వ యాజమాన్యం	లోకల్ బాడీ
పీజీ హెచ్‌ఎం	7	44
పీఎస్ హెచ్‌ఎం	3	55
ఎస్‌ఏ గణితం	3	7
ఎస్‌ఏ ఫిజిక్స్	6	10
ఎస్‌ఏ బయోసైన్స్	2	22
ఎస్‌ఏ సోషల్	10	44
ఎస్‌ఏ తెలుగు	1	9
ఎస్‌ఏ హిందీ	1	9
ఎస్‌ఏ ఇంగ్లిష్	4	13
ఎస్‌ఏ మరాఠీ	1	1
ఎస్‌ఏ ఉర్దూ	1	1

'కంటి వెలుగు'పై విస్తృత ప్రచారం కల్పించాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కైలాస్‌నగర్: క్యాంపులకు ఎక్కువ మంది ప్రజలు హాజరయ్యేలా క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికి వెళ్లి కంటి వెలుగు కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణ పరిధిలోని బంగారుగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రం పరిధిలోని ప్రజలు శిబిరానికి తరలివచ్చేలా ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ప్రోత్సహించాలన్నారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులతో మాట్లాడిన కలెక్టర్ క్యాంపుల నిర్వహణపై ఆరా తీశారు. మన ఊరు– మన బడి కింద పాఠశాలలో చేపడుతున్న తరగతి గదుల మరమ్మతులు, వంట గది, మరుగుదొడ్లు. ప్రహరీ, ఆటస్థలం పరిశీలించారు. పాఠశాలలో ఆకట్టుకునేలా పెయింటింగ్ వేయించాలని, డిజైన్ ఫ్లోరింగ్ పనులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు నోడల్ అధికారి డాక్టర్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం

ఆదిలాబాద్‌టౌన్: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వైటీసీలో జరుగుతున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సోమవారం ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంద రోజుల పాటు కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందని, సెలవు రోజుల్లో మినహా మిగితా రోజుల్లో కంటి పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- అర్జీలను స్వీకరించిన కలెక్టర్
- పలువురు జిల్లాస్థాయి అధికారుల గైర్హాజర్



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కైలాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని కొంతమంది జిల్లాస్థాయి అధికారులు లైట్‌గా తీసుకుంటున్నారు. సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి పలువురు అధికారులు గైర్హాజరు కాగా మరి కొంతమంది కలెక్టర్ వచ్చిన గంటసేపటి తర్వాత రావడమే ఇందుకు నిదర్శనం. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు అధికసంఖ్యలో తరలిరావడంతో వినతులు వెల్లువెత్తాయి. వారి నుంచి అర్జీలను స్వీకరించిన కలెక్టర్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులను ప్రశ్నించేందుకు పిలువగా సదరు అధికారులు అందుబాటులో లేరు. ఆర్డీఓ, డీఆర్‌డీఓ, డీఈఓ, డీపీఓ, డీఎంహెచ్‌ఓ, వ్యవసాయశాఖ, మత్స్యశాఖ, బీసీ సంక్షేమాధికారి , రిమ్స్ డైరెక్టర్ వంటి ప్రధాన శాఖల అధికారులంతా గైర్హాజరయ్యారు. దీంతో మధ్యాహ్నం జిల్లా అధికారుల కుర్చీలు ఖాళీగా కన్పించాయి. వారికి బదులుగా కిందిస్థాయి ఉద్యోగులు హాజరయ్యారు. ఎస్సీ కార్పోరేషన్ ఈడీ, డీఎస్సీడీఓ , డీఎస్ఓ, డీడబ్ల్యూఓ, డీఎం సివిల్ సప్లై, పరిశ్రమల శాఖ జీఎం , పశు సంవర్ధకశాఖ వంటి జిల్లా అధికారులు కలెక్టర్ వచ్చిన గంటసేపటి తర్వాత కార్యక్రమానికి హాజరుకావడం గమనార్హం. కలెక్టర్ అర్జీలను స్వీకరించిన సమయంలో కేవలం ఒకరిద్దరు మాత్రమే అధికారులుండటంపై అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులంతా అందుబాటులో ఉంటారనే ఉద్దేశ్యంతో తమ సమస్యలను చెప్పుకునేందుకు వస్తే వారు లేకపోవడంతో చేసేదేమిలేక నిరాశతో వెనుదిరుగాల్సి వచ్చిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ అరవింద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాగోబా జాతరలో భక్తుల రద్దీ



ముస్తాబైన నాగోబా దర్బార్



వాయిద్యాలతో భాన్ దేవతల ఆలయానికి బయలుదేరిన మెస్రం వంశీయులు



గిరి'జన' జాతర..

పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 21న పవిత్ర గంగాజలంతో కేస్లాపూర్‌లో నాగోబాకు నిర్వహించిన మహాపూజతో ప్రారంభమైన గిరిజన జాతర సంప్రదాయబద్ధంగా సాగుతోంది. వేడుకల్లో భాగంగా మెస్రం వంశీయులు సోమవారం పెర్సపేన్, భాన్‌దేవతలకు పూజలు నిర్వహించారు. భేటింగ్ అయిన కొత్తకోడళ్లు కోనేరు వద్దకు వెళ్లి పవిత్ర జలాలను తీసుకువచ్చారు. మెస్రం వంశ అల్లుళ్లు, ఆడపడుచులు వేర్వేరుగా పెర్సపేన్, భాన్‌దేవతలకు పూజలు చేశారు. మెస్రం వంశ మహిళలకు నాగోబా చరిత్ర, మెస్రం వంశంలోని 22 కితల చరిత్రను బోధించారు. మంగళవారం నిర్వహించే దర్బార్‌కు మెస్రం వంశపెద్దలు ఏర్పాట్లు చేశారు. మరోవైపు నాగోబా దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. సోమవారం తెలంగాణతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ఒడిశా నుంచి తరలివచ్చిన భక్తులు నాగోబాను దర్శించుకున్నారు.

- మరిన్ని వివరాలు 8లో▸

క్లుప్తంగా

'హామీలపై మంత్రి సత్యవతి స్పష్టత ఇవ్వాలి'

ఆదిలాబాద్‌రూరల్: ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతరలో భాగంగా మంగళవారం నిర్వహించే దర్బార్‌కు హాజరు కానున్న రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ ఆదివాసీలకు గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై స్పష్టత ఇవ్వాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని ఇవ్వలేదని, జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు వాగ్దానం నిలబెట్టుకోలేదని అన్నారు. తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్ర శ్యాంరావ్, ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయికే సంజీవ్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు సలాం వరుణ్, గుడిహత్నూర్ మండల అధ్యక్షుడు వెలదీ నందు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలు సమర్పించారు. అదనపు కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బోకర్ మండలం కినీకి గ్రామానికి చెందిన కోర్దెవాడ్ కృష్ణ(24) దుర్మరణం చెందాడు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణ తన స్నేహితుడు అభిలాష్‌రెడ్డితో కలిసి మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద తన బంధువులు చేసిన పండుగకు హాజరయ్యాడు. తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. అభిలాష్‌రెడ్డి తన ద్విచక్ర వాహనం అజాగ్రత్తగా, అతివేగంగా నడిపాడు. అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టారు. అభిలాష్‌రెడ్డి, కృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నాందేడ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో కృష్ణ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: కుటుంబ కలహాలు, అప్పుల బాధతో ఒకరు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని నేతాజీ చౌక్‌లో చోటుచేసుకుంది. పట్టణంలోని నేతాజీచౌక్‌లో నివాసం ఉంటున్న నరేందర్(38) రాత్రి ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. హైదరాబాద్‌లోని ఎస్‌బీఐలో ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గతంలో శివాజీచౌక్‌లోని ఎస్‌బీఐలో ఉద్యోగి చేశాడు. మృతుడికి భార్య, మూడేళ్ల కూతురు ఉంది. తండ్రి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ఇంటి దగ్గర ఉంటూ మా ఇన్వెస్ట్‌మెంట్ బిజినెస్‌కి సంబంధించిన కాల్స్ మాట్లాడటానికి ఫీమేల్ స్టాఫ్ అ॥ కా॥ను. కమిషన్+బోనస్+జీతం, ఇంట్రెస్టెడ్‌గా ఉన్నవారు డిటెయిల్స్ వాట్సాప్ చేయగలరు - 6281159171 [HA-28284]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K. Ph: 7569955551/ 9848571888 [H.786823]

■ డైరెక్ట్ జాబ్! Hyd లో 5స్టార్ హోటల్స్ లో క్యాటరింగ్ బాయ్స్ పరిశ్రమలలో ప్యాకింగ్ బాయ్స్ సాలరీ: 25-35వేలు, రూమ్+మీల్స్ కలదు. ఫోన్ : 9542442263. [H.792786]

■ హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు హౌస్ కీపింగ్ (బాయ్స్) కావలెను. జీతం: 15,000+రూమ్, భోజనం ఫ్రీ. ఫోన్ : 9059135749, 8886414541. [HA-10062]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462



నాగోబాకు మొక్కి.. పెర్సపేన్‌ను పూజించి...

- వైభవంగా కొనసాగుతున్న నాగోబా జాతర
- కొనసాగుతున్న మెస్రం వంశీయుల సంప్రదాయ పూజలు
- తరలి వస్తున్న భక్తులతో కిటకిటలాడుతున్న కేస్లాపూర్

ఇంద్రవెల్లి(ఖానాపూర్): పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 21న పవిత్ర గంగాజలంతో నాగోబాకు మహాపూజ నిర్వహించి జాతర ప్రారంభించిన మెస్రం వంశీయులు సోమవారం పెర్సపేన్, భాన్‌దేవతలకు ఘనంగా పూజలు నిర్వహించారు. భేటింగ్ అయిన కొత్తకోడళ్లు కోనేరు వద్దకు వెళ్లి పవిత్ర జలాలను తీసుకువచ్చారు. మెస్రం వంశ అల్లుళ్లు భాన్‌దేవత ఆలయం ఎదుట ఉన్న పాత పుట్టలను తొలగించడంతో మెస్రం వంశ ఆడపడుచులు పవిత్ర జలాలతో భాన్‌దేవతను శుద్ధి చేశా రు. ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

కొత్త కోడళ్లకు చరిత్ర బోధన

గోవడ్ వద్ద బస చేసిన మెస్రం వంశీయులు సోమవారం సంప్రదాయ వంటలు చేసి సంహపంక్తి భోజనాలు చేశారు. ప్రధాన్ కితకు చెందిన మెస్రం గంగారాం ఆధ్వర్యంలో కిక్రి వాయిస్తూ కొత్తకోడళ్లు, మెస్రం వంశ మహిళలకు నాగోబా చరిత్ర, మెస్రం వంశంలోని 22 కితల చరిత్రను బోధించారు. అనంతరం ప్రధాన్ కిత మెస్రం వంశీయులకు కొత్త కోడళ్లు, మెస్రం వంశ మహిళలు కానుకలు అందించారు.

గాయిక్ కిత మెస్రం వంశీయుల మొక్కులు

గాయికి కితకు చెందిన మెస్రం వంశీయులు సోమవారం నాగోబా ఆలయంలో ఆవుదూడను వదిలి మొక్కును చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్లుగా గాయికి కితలో కోడళ్లకు భేటింగ్ అయ్యే అవకాశం రాకపోవడంతో నాగోబాకు మొక్కినట్లు తెలిపారు. నాగోబా ఆశీర్వాదంతో ఈసారి తమ కితకు చెందిన కోడళ్లకు భేటింగ్ చేసే అవకాశం వచ్చిందని, 100 మందికి భేటింగ్ (పరిచయం) చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గాయిక్ కిత మెస్రం వంశ పెద్దలు శేఖర్‌బాబు, మానిక్‌రావ్, దేవ్‌రావ్, మనోహర్, జంగు, తదితరులు పాల్గొన్నారు.

నేడు నాగోబా దర్బార్

- హాజరు కానున్న మంత్రులు సత్యవతి రాథోడ్ అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి


ముస్తాబైన నాగోబా దర్బార్ వేదిక

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఈ నెల 21న మెస్రం వంశీయుల మహా పూజతో ప్రారంభమైన నాగోబా జాతర కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్రల నుండి అధికసంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. సోమవారం విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డితో పాటు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జాతరను పురస్కరించుకుని నేడు నిర్వహించనున్న నాగోబా దర్బార్‌కు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కవిత, దండె విఠల్, జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

ఇదీ నాగోబా దర్బార్ చరిత్ర

నాగోబా దర్బార్‌కు ప్రత్యేక చరిత్ర ఉంది. 77 ఏళ్ల క్రితం భూమికోసం, భుక్తి కోసం, విముక్తికోసం జల్ జంగల్ జమీన్ నినాదంతో కుమురంభీం నిజాం సర్కార్‌తో పోరాటం చేశాడు. అతని పోరాటానికి ఉల్లికిపడ్డ నిజాం సర్కార్ ఆదివాసీ గిరిజనులపై అధ్యాయనం చేయడానికి మానవపరిణామ శాస్త్రవేత్త హైమాన్‌డార్ఫ్‌ను ఉమ్మడి ఆదిలాబాద్‌కు పంపించింది. జిల్లాకు వచ్చిన హైమాన్‌డార్ఫ్ మార్లవాయి గ్రామంలో ఉండి ఆదివాసీ గిరిజన గ్రామాల్లో పర్యటించారు. ఆదివాసీలపై అధ్యయనం చేసే సమయంలో పుష్యమాసంలో ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులంతా కేస్లాపూర్ గ్రామానికి చేరుకుని వారంరోజులు అక్కడే ఉండి నాగోబాకు పూజలు చేస్తున్న విషయం తెలుసుకున్నారు. వారి సమస్యలు, స్థితిగతులు తెలుసుకునేందుకు ఇదే మంచిస్థలంగా గుర్తించిన హైమన్‌డార్ఫ్ 1946లో నాగోబా దర్బార్ పేరుతో వారితో సమావేశమయ్యాడు. ఆక్వామే కదీం(ఆదివాసీ సంక్షేమ శాఖ కమిటీ)ని ఏర్పాటు చేశాడు. ఏటా పుష్యమాసంలో కేస్లాపూర్‌కు వచ్చి ఆదివాసీల స్థితిగతులు తెలుసుకుని నిజాం సర్కర్‌కు పంపించేవారు. అప్పటి నుంచి ఆక్వామే కదీం కమిటీ సభ్యులు, మెస్రం వంశీయులు ప్రతీ సంవత్సరం దర్బార్ నిర్వహిస్తున్నారు. 1981 ఇంద్రవెల్లి సంఘటన తర్వాత 1983 నుంచి ఏటా ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అధికారికంగా దర్బార్ నిర్వహిస్తోంది. ఆదివాసీల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తున్నారు. నేడు నిర్వహించనున్న దర్బార్ సమావేశానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 11 గంటలకు మంత్రులు నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం దర్బార్ సమావేశంలో పాల్గొననున్నట్లు ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు.


సంప్రదాయ వాయిద్యాలతో ప్రధాన్ కిత మెస్రం వంశీయులు


పుట్టలు తయారు చేస్తున్న మెస్రంవంశ ఆడపడుచులు


లోక భూమారెడ్డిని సన్మానిస్తున్న మెస్రం వంశీయులు


కొత్త కోడళ్లకు చరిత్ర బోధిస్తున్న మెస్రం గంగారాం



ఘనంగా పూజలు

గోవడ్ నుంచి వచ్చిన మెస్రం ఆడపడుచులు, మహిళలు భాన్‌దేవతలకు పూజలు చేయగా మెస్రం వంశీయులు పక్కనే ఉన్న నాలుగు సగల పెర్సపేన్ (పెద్ద దేవుళ్ల)కు పూజలు నిర్వహించారు. గోదావరి నుంచి తీసుకువచ్చిన పవిత్ర గంగాజలంతో పెర్సపేన్ దేవుళ్లను శుద్ధిచేసి పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో మెస్రం వంశానికి చెందిన పురుషులు మాత్రమే పాల్గొన్నారు. ఈ నెల 25న గోవడ్ ముఖద్వారం వద్ద బేతల్ పూజలు చేసి మెస్రం వంశీయుల సంప్రదాయ పూజలు ముగించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావ్ తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో ఇద్దరికి జైలు

ఆదిలాబాద్‌టౌన్: బాలికను అపహరించిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి మాధవికృష్ణ తీర్పునిచ్చినట్లు లైజన్ ఆఫీసర్ పండరి తెలిపారు. ఆదిలాబాద్‌లోని తాటిగూడకు చెందిన మానే ప్రఫుల్ మావల మండలంలో ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. బాలిక(16)తో పరిచయం పెంచుకుని 2018 జనవరి 28న మహారాష్ట్రలోని పూణేకు తీసుకెళ్లాడు. ద్విచక్ర వాహనాన్ని ఓ సినిమా థియేటర్‌లో ఉంచాడు. పూణేలో ఉండే తన అన్నయ్య ఇంటికి తీసుకెళ్లి మూడు రోజులపాటు బంధించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇతర ప్రదేశంలో తిరిగి హైదరాబాద్‌లో వదిలి వెళ్లాడు. బాధితురాలు ఇంటికి వచ్చి కిడ్నాప్ విషయాన్ని కుటుంబీకులకు తెలుపడంతో మావల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పీపీ రమణా రెడ్డి పది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. నిందితుడు మానే ప్రఫుల్‌కు జడ్జి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా, ఆయనకు సహకరించిన తన అన్న మానే సునీల్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

కలప పట్టివేత

కడెం: కారులో అక్రమంగా తరలిస్తున్న రూ.65 వేల విలువైన కలప పట్టుకున్నామని ఎఫ్‌ఆర్‌వో అనిత తెలిపారు. కారులో కలప తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు డిప్యూటీ రేంజ్ అధికారి సిద్దార్థ పాండ్వాపూర్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి తనిఖీ చేపట్టారని పేర్కొన్నారు. కారు ఆపకుండా వెళ్లిపోవడంతో సిబ్బంది వెంబడించి మున్యాల్ గ్రామం వద్ద పట్టుకున్నారని వివరించారు. నిందితులు పారిపోయారని తెలిపారు. కారులో ఉన్న 8 దుంగలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎఫ్‌బీవో అలీం తదితరులు పాల్గొన్నట్లు వెల్లడించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఉట్నూర్: ప్రజావాణిలో గిరిజనుల అర్జీలను ఆయా విభాగాలుగా పరిశీలించి అర్హులైన వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాగోబా జాతర విజయవంతం అయ్యేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజావాణికి 46 అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు.

కిడ్నాపర్లకు తుపాకి అమ్మిన వ్యక్తి అరెస్ట్

నిర్మల్‌టౌన్: అక్టోబర్‌లో ఒక మహిళ సహకారంతో ఆర్‌ఎంపీ కిడ్నాప్‌కు యత్నించి డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలోని అంతర్రాష్ట్ర కిడ్నాపర్లకు తుపాకి అమ్మిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు నిర్మల్ రూరల్ సీఐ వెంకటేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం వివరాలు వెల్లడించారు. గత అక్టోబర్‌లో నిర్మల్‌కు చెందిన ఓ మహిళ సహకారంతో కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన ఆర్‌ఎంపీని ప్రలోభ పెట్టి నిర్మల్‌కి రప్పించారు. కారులో వచ్చిన ఆర్‌ఎంపీని రెండు మోటర్ సైకిళ్లపై నలుగురు వెంబడించారు. మహారాష్ట్రలోని అటవీ ప్రాంతంలో వెళ్లిన తర్వాత తుపాకితో బెదిరించి బంధించారు. డబ్బులు డిమాండ్ చేశారు. తర్వాత ద్విచక్రవామనంపై తీసుకెళ్తుండగా గ్రామస్తులు దొంగలుగా అనుమానించారు. వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో అక్టోబర్ 20న నలుగురు కిడ్నాపర్లను అరెస్టు చేశారు. వారికి తుపాకీ అమ్మిన మధ్యప్రదేశ్‌కు చెందిన రాహుల్ రజాక్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. రాహుల్ రజాక్ నిర్మల్ మీదుగా మహారాష్ట్ర వెళ్తున్నట్లు అందిన సమాచారంతో తనిఖీలు నిర్వహించి అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.


మాట్లాడుతున్న రూరల్ సీఐ వెంకటేష్

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 16 మందికి జరిమానా

లక్ష్మణచాంద: మండలంలో ఇటీవల మద్యం సేవించి వాహనాలు నడుతూ పోలీసులకు పట్టుబడిన 16 మందికి నిర్మల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జరిమానా, ఒకరికి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. 17 మందిని సోమవారం కోర్టులో హాజరు పర్చగా 16 మందికి రూ.3,500 చొప్పున జరిమానా, ఒకరికి జైలు శిక్ష విధించినట్లు వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పట్టుబడిన 9 మందికి రూ.1,890 చొప్పున జరిమానా విధించినట్లు వెల్లడించారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కైలాస్‌నగర్: కేజీబీవీల్లో పనిచేసే నాన్ టీచింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటోందని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటనారాయణ, తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుర్గం కళావతి ఆరోపించారు. కేజీబీవీల నాన్ టీచింగ్ ఉద్యోగులకు నెలకు రూ.26వేల కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీ, యూఆర్‌ఎస్ నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలను పెరిగిన ధరలకనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. వారిని పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.సుల్తానా, జిల్లా నాయకులు సునీత, ప్రేమల, రజిత, శ్రీవేజ, వీణ, వందన, జ్యోతి, గీత, ఆశాబాయి, నీలమ్మ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

- స్పెషల్ డ్రైవ్‌లో కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలి
- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ

నిర్మల్‌చైన్‌గేట్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మత్స్యకారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మత్స్య సహకార సంఘాల సమన్వయ కమిటీ సభ్యుడు డాక్టర్ బొజ్జ నారాయణముదిరాజ్, ముదిరాజ్ జేఏసీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శివయ్య అన్నారు. మస్కాపూర్, గోపాల్‌పేట, పీచర గ్రామాలకు చెందిన ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్మల్ కలెక్టర్‌తోపాటు మత్స్య శాఖ ఏడీకి సోమవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 6 నుంచి ప్రభుత్వం ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్ రెండో విడత కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో మత్స్యకారులకు సభ్యత్వం కల్పించడంతోపాటు కొత్త సొసైటీల ఏర్పాటు చేయాలన్నారు. మత్స్యకారులకు సభ్యత్వంతోపాటు వివిధ నదులలో చేపలు పట్టేందుకు వీలుగా లైసెన్సులు ఇవ్వాలన్నారు. గోదావరిలో చేపలు పట్టేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లాకు చెందిన బొండ్ల రమేశ్, పంబల శేఖర్‌ముదిరాజ్ , సంతోష్‌ముదిరాజ్ , గంగాధర్‌ముదిరాజ్, పిట్టల భూమన్న, నరేందర్, భీమేశ్, చిన్నయ్య బొర్రన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ద్వితీయ స్థానం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ సబ్ జూనియర్ హాకీ జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటింది. ఈ నెల 21నుంచి 23వరకు రంగారెడ్డి జిల్లా కేంద్రంలోని శంషాబాద్‌లో నిర్వహించిన 7వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచింది. సోమవారం మహబూబ్‌నగర్ జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 5–0 తేడాతో రెండో స్థానం కైవసం చేసుకుంది. అంతకుముందు సెమీఫైనల్ మ్యాచ్‌లో నల్గొండ జట్టుపై 1–0 తేడాతో గెలిచి ఆదిలాబాద్ ఫైనల్‌కు చేరింది. ట్రిపుల్ ఒలింపియన్ ముఖేష్‌కుమార్, రాష్ట్ర హాకీ అసోసియేషన్ చైర్మన్ కొండ విజయకుమార్ జిల్లా జట్టుకు ట్రోఫీని బహుకరించారు. కోచ్ అతుల్‌కుమార్, మేనేజర్ శేఖర్ సీనియర్ క్రీడాకారులు రవి, అజాజ్, పంకజ్, డేవిడ్ ఉన్నారు. క్రీడాకారులను ఐటీడీఏ పీఓ కే.వరుణ్‌రెడ్డి, డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.గోవర్ధన్‌రెడ్డి, పార్థసారథి అభినందించారు.


ట్రోఫీ అందుకుంటున్న జిల్లా హాకీ క్రీడాకారులు

బ్రిడ్జిపై లారీ బోల్తా

నేరడిగొండ: మండలంలోని కుప్టి బ్రిడ్జిపై సోమవారం ఉదయం ఓ లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఆగ్రా నుంచి హైదరాబాద్‌కు పాల పౌడర్ బ్యాగుల లోడ్‌తో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. లారీ డ్రైవర్ కుల్దీప్, క్లీనర్ సోను స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఆ దారి గుండా కొంతసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్సై సాయన్న రాకపోకలకు అంతరాయం లేకుండా చూశారు.

మున్సిపల్ స్థల ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కైలాస్‌నగర్: మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసి, చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని టీఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌లో మున్సిపల్ స్థలానికి కొంతమంది నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, సెల్ఫ్ అసెస్‌మెంట్ చేసుకుని అందులో అక్రమ నిర్మాణాన్ని ప్రారంభించారన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి ఆ స్థలాన్ని మున్సిపల్ ఆధీనంలోకి తీసుకునేలా చూడాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్‌కుమార్, అధికార ప్రతినిధి నక్క రాందాస్, మల్యాల స్వామి, లింగంపల్లి ప్రసన్నరావు, తదితరులు ఉన్నారు.

అక్రమ లేఅవుట్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

కై లాస్‌నగర్: పట్టణంలోని ఖానాపూర్ కాలనీలో అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌పై చర్యలు తీసుకోవాలని యాంటి కరప్షన్ బోర్డు రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాహిద్ అలీ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కోరారు. ఖానాపూర్‌లోని సర్వే నెంబర్ 273/1/1 , 273/1/2 , 273/1/6లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ ఏర్పాటు చేశారన్నారు. దానిపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు